ప్రజాశక్తి

బుధవారం 27 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





కేంద్రంపై కార్మిక, కర్షక గర్జన



విశాఖ నగరంలో సాగుతున్న భారీ కార్మిక ప్రదర్శన

- విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో భారీ నిరసన ప్రదర్శనలు, సభలు
- ప్రజా వ్యతిరేక విధానాలపై మండిపాటు
- కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న మోడీకి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిక
- విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ప్రతిన



అనకాపల్లి పట్టణంలో నిర్వహిస్తున్న కార్మిక, కర్షక ప్రదర్శన

కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలపై అఖిలపక్ష కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యాన విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మంగళవారం చేపట్టిన నిరసన ప్రదర్శనలు, సభలు విజయవంతమయ్యాయి. పెద్ద సంఖ్యలో కార్మికులు, రైతులు, వివిధ తరగతుల ప్రజలు తరలివచ్చి మోడీ సర్కారు నిరంకుశ విధానాలను ఖండించారు. కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, తమపై భారాలు మోపుతున్న మోడీ సర్కారుపై తీవ్ర ఆగ్రహం వెలుబుచ్చారు. నిరసన ప్రదర్శనల అగ్రభాగాన సాగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రజలను ఆలోచింపజేశాయి.

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : విశాఖలోని దొండపర్తి రైల్వే డిఆర్ఎం కార్యాలయం నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన జరిగింది. అనంతరం బహిరంగ సభ నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ చర్యలను ఆపాలని, కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పెద్దపెట్టున నినదించారు. ఇపిఎస్ 95 పెన్షన్‌దారులకు నెలకు రూ.9 వేలకు తక్కువ లేకుండా పెన్షన్ ఇవ్వాలని, అధిక ధరలను నియంత్రించాలని, విద్యుత్ భారాలను మోపొద్దని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం.శ్రీనివాస్, ఆర్‌కెఎస్‌వి.కుమార్, నాయకులు పి.మణి, బి.జగన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మన్మధరావు, జిఎస్‌జె.అచ్యుతరావు, డి.ఆదినారాయణ, ఎస్‌కె.రెహమాన్, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, రామచంద్రరావు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, తిరుపతి, సిఎఫ్‌టియు మిగతా 2లో..

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం

వార్త 2లో..

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలేదీ ?

వార్త 2లో..

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురిపై చర్యలు

వార్త 2లో..



ఆర్‌కె బీచ్‌లో ఎగిసిపడుతున్న అలలు

అలజడిగానే వాతావరణం

దక్షిణ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న తూర్పు హిందూ సముద్రం మధ్య కొనసాగుతున్న అల్పపీడనం వాయుగుండంగా మారడంతో ఆ ప్రభావం వాతావరణ పరిస్థితులపై పడింది. మంగళవారమంతా విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో చల్లని గాలులు వీచాయి. తీరంలో అలలు ఎగిసిపడ్డాయి. కోస్తాకు, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు వర్ష సూచన ఉండటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వరి కోతలను వాయిదా వేసుకోవాలని ఇప్పటికే వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన విషయం తెలిసిందే.

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖ-కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించేందుకు ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్‌లో విశాఖపట్నం - కిరండూల్ - విశాఖపట్నం మధ్య నడిచే కిరండూల్ రైలుకు అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జోడించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో 08551 విశాఖపట్నం - కిరండూల్ రైలుకు డిసెంబర్ 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27 తేదీల్లోనూ, 08552 కిరండూల్ - విశాఖపట్నం రైలుకు డిసెంబర్ 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28 తేదీల్లోనూ అదనపు విస్టాడోమ్ కోచ్‌ను జత చేయనున్నారు.

30న పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో లబ్ధిదారులందరికీ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను వారి వారి ఇంటి వద్దనే సకాలంలో పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు, జిల్లా కలెక్టర్ సూచన మేరకు డిసెంబర్ 1వ తేదీ (ఆదివారం) సెలవు దినం కావడం వల్ల పింఛన్ల పంపిణీ కార్యక్రమం నవంబరు 30న ఉంటుందని పేర్కొన్నారు.



అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

వాడవాడలా ప్రతిజ్ఞలు

వార్తలు 7లో..

కేంద్రంపై కార్మిక, కర్షక గర్జన



నర్సీపట్నం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు, ప్రజలు

(మొదటి పేజీ తరువాయి..) జాతీయ కార్యదర్శి ఎన్.కనకరావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, ఎఐసిటియు నాయకులు శంకరరావు, ఎఐసిసిటియు నాయకులు వాసుదేవరావు తదితరులు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం కార్పొరేట్ల కనుసన్నల్లో నడుస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మే హక్కు మోడీకి ఎవరిచ్చారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ జరగకుండా ఎపికి చెందిన కూటమి ఎంపీలంతా పట్టుబట్టాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో రాజ్యాంగ హక్కులు, కార్మిక హక్కుల కోసం, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున కార్మిక వర్గం, రైతాంగం, ప్రజలు పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మోడీ తన విధానాలను మార్చుకోకపోతే దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు కార్మిక వర్గం, ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, జి.అప్పలరాజు, కుమార మంగళం, టి.నూకరాజు, ఉరుకూటి రాజు, పి.వెంకటరావు, పద్మ, వెంకటలక్ష్మి, మంగశ్రీ, సురేష్, లక్ష్మి, కాసుబాబు, సత్యాంజనేయ, కె.లక్ష్మి, జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన మున్సిపల్, ముఠా, బిల్డింగు, ఆటో, ఆశా, అంగన్వాడీ, మిడ్డేమీల్స్ కార్మికులు, విఒఎలు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థల కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి : సిఐటియు కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ మానవహారం చేపట్టారు. రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయం వద్దకు ర్యాలీగా చేరుకుని నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ మర్రాపు సూర్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దొరబాబు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, అధ్యక్షులు కర్రి అప్పారావు, రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు, రైతు కూలీ సంఘం నాయకులు కోన మోహన్‌రావు, వ్యవ సాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్, ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, వర్కింగ్ ఉమెన్ నాయకులు గూనూరు వరలక్ష్మి, ఎఐటియుసి పట్టణ కన్వీనర్ వైఎన్.భద్రం, సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు ప్రసంగించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, మోడీ ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని అన్నారు. విద్యుత్ ధరలు పెరగడానికి కారణమైన విద్యుత్ సంస్కరణ బిల్లును తీసుకొచ్చారన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కరువైందని అన్నారు. కౌలు రైతులు అప్పులు పుట్టక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లు రాజకీయ వేధింపులకు గురవుతున్నారన్నారు. ఎంఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదానీ అవినీతిపై అమెరికాలో కేసు నమోదైందని, అయినా ఆయన్ని మోడీ ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో అదానీ అవినీతిపై చంద్ర బాబు నోరు విప్పడం లేదన్నారు. ఆ అవినీతిలో ఈ ప్రభుత్వానికి కూడా వాటా ఉన్నట్టు అనుమానించాల్సి వస్తోందన్నారు. సెజ్, ఫార్మా కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, రొంగలి రాము, జి.దేముడు నాయుడు, రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయనబాబు, ప్రజా సంఘాల నాయకులు కె.శంకరరావు, పలు రంగాల కార్మికులు పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్ : సిఐటియు, రైతు సంఘం, ఐద్వా ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని ఎన్‌టిఆర్ స్టేడియం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించారు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారాలు మోపడం దారుణమన్నారు.

కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఐద్వా జిల్లా కోశాధికారి కెవి.సూర్యప్రభ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వి.సత్యవతి, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, అంగన్వాడీ యూనియన్ నాయకులు వి.సామ్రాజ్యం, ఎం.మంగతాయారు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ కార్యాలయం నుంచి వై.జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి, నాయకులు రవ్వ నరసింగ రావు, ఎస్.అప్పలనాయుడు, వి.నాగరాజు, పి.పెంటరాజు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



తగరపువలసలో నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలేదీ ?

- మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలులో లేదని, గడచిన ఆరు మాసాలుగా రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. 75వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎల్‌ఐసి దరి అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఆధ్వర్యంలో నివాళులు అర్పించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం అగ్రరాజ్యాలతో పోటీ పడాలని, అందరూ సమానంగా సమాజంలో మెలగాలని అంబేద్కర్ చెప్పారన్నారు. గడచిన ఆరు మాసాల కూటమి పాలనలో అంబేద్కర్ విగ్రహాల మీద దాడులు పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు వాసుపల్లి గణేష్ కుమార్, కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, వైసిపి ఎస్‌సి విభాగం అధ్యక్షులు పి.శివరామకృష్ణ, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గం

ప్రజాశక్తి - ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగులకు రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం యాజమాన్యం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1384వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్ ఎల్ఎంఎం, డబ్ల్యుఆర్ఎం 1, 2, ఎంఎంఎస్ఎం, ఎస్‌టిఎం విభాగాల కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం ప్రగతికి కృషి చేస్తున్న కార్మికవర్గానికి రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని తెలిపారు. ఏడు నెలలుగా రెండు వాయిదాల పద్ధతిన జీతాలు చెల్లిస్తూ వచ్చిన ఉక్కు యాజమాన్యం రెండు నెలలుగా పూర్తిగా జీతాలే చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్లాంట్ యాజమాన్యం మొండి వైఖరి పట్ల కార్మికులు అసహనంతో ఉన్నారన్నారు. తక్షణమే సమస్యను పరిష్కరించకుంటే కార్మికాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. దీక్షల్లో నాయకులు ఎ.వమేసన్‌రావు, డి.దేముడు, జి.ఆనంద్, ఎంకెవి.రాజేశ్వరరావు, సన్నిబాబు, పి.సీతారామరాజు, రాంబాబు, బాషా, కార్మిక సంఘాల నాయకులు విల్లా రామ్మోహన్ కుమార్, ఎం.మహాలక్ష్మి నాయుడు, దాసరి సురేష్ బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా విహెచ్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు తొత్తరమూడి శ్రీనివాసరావు ఆధ్వర్యాన మంగళవారం ఘనంగా నిర్వహించారు. వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ పోరాటం ద్వారానే సాధ్యమైందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అక్కిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కమిషనర్ సంపత్ కుమార్

బాల్యం కేంద్రాల అభివృద్ధికి ముందుకురండి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో నడుస్తున్న బాల్యం విద్యా కేంద్రాల నిర్వహణకు దాతలు ముందుకు రావాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నడపబడుతున్న బాల్యం విద్యా కేంద్రాల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విశాఖ జిల్లా విద్యాశాఖాధికారి అందించిన యూనిఫాం క్లాత్‌తో స్థానిక దాతల ద్వారా సేకరించిన నిధులతో కుట్టించిన యూనిఫాం, స్కూల్ బెల్ట్, స్కూల్ షూ, సాక్సులను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (విద్య అండ్ ఫైనాన్సు) ఎస్ఎస్.వర్మ, బాల్యం విద్యా కేంద్రాల సూపర్‌వైజర్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురిపై చర్యలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖపట్నం జోన్ - 8 టౌన్ ప్లానింగ్‌లో విధుల్లో నిర్లక్ష్యం వహించిన వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిపై సస్పెన్షన్ వేటు పడింది. అదే జోన్‌లో టిపిఒ తేజేశ్వరరావు, అప్పటి ఎసిపి రఘునాథరావులకు షోకాజ్ నోటీస్‌లను జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ మంగళవారం అందజేశారు.

సమస్యలతో సతమతం!

- గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తతో చిక్కులు
- దుర్వాసన, దోమల బెడదతో ఇక్కట్లు
- వీధి దీపాల్లేక రాత్రివేళల్లో అగచాట్లు
- ఫిర్యాదుచేసినా పట్టని అధికారులు
- 43వ వార్డు గెడ్డ ప్రాంతాల్లో దుస్థితి



గెడ్డ కాలువల్లో ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తా చెదారం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 43వ వార్డు గోలీలపాలెం వద్ద గెడ్డలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. కర్రి వారి బ్రిడ్జి వద్ద చెత్తను రెండునెలలుగా తొలగించే పరిస్థితి లేకపోవడంతో దోమలు వ్యాప్తితో అనారోగ్యంతో బాధపడుతున్నామని వాపోతున్నారు. బ్రిడ్జి వెనక డ్రైనేజీ, కల్వర్టులు పూర్తిగా దెబ్బతినడంతో మురుగునీరు గెడ్డలోకి వెళ్లకుండా నిల్వ ఉండిపోతోందని, దీనిపై పారిశుధ్య విభాగానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఈఏడాది కురిసిన వర్షాలకు గెడ్డపై బ్రిడ్జి రక్షణగోడ కుప్పకూలిపోవడంతో, ఈ రోడ్డు మార్గాన ప్రయాణిస్తున్న వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇరుకుగా ఉన్న బ్రిడ్జిపై ఏమాత్రం ఆదమరిచి వాహనాలను నడిపినా ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఇప్పటికే ఇటువంటి పలు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని అంటున్నారు. ఈ ప్రాంతంలో వీధి లైట్లు లేకపోవడంతో చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మరోవైపు రెండు నెలలుగా వీధిదీపాలు వెలగకపోవడంతో చీకటిపడ్డాక ఆకతాయిల అల్లర్లుతో ఇబ్బందికరంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. దీనిపై సంబంధిత జివిఎంసి అధికారులకు ఫిర్యాదు చేస్తే, ఒకటి రెండు సార్లు మొక్కుబడిగా పరిశీలనకు వచ్చారే తప్ప, ఎటువంటి పరిష్కార చర్యలు చేపట్టలేదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా తమ సమస్యలపై జివిఎంసి అధికారులు దృష్టిసారించి, పరిష్కార చర్యలు చేపట్టాలని స్థానికులు వాహనదారులు కోరుతున్నారు.

వీధి దీపాల్లేక ఇబ్బందులు



గెడ్డపై బ్రిడ్జి రక్షణగోడ కూలి ప్రమాదభరితంగా ఉంది. వీధిలైట్లు వెలగకపోవడంతో చీకటి పడితే అటుగా వెళ్లడం ప్రమాదాన్ని కొని తెచ్చుకున్నట్లే. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలి.

ఎం.సత్యవతి, స్థానికురాలు

దుర్వాసనతో చస్తున్నాం..



గెడ్డలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. దోమలు విజృంభించి జర్వాల పాలౌతున్నా రెండు నెలలుగా పట్టించుకునే దిక్కులేదు. జివిఎంసి యంత్రాంగం స్పందించాలి.

బొడ్డేటి. కన్నయ్యమ్మ, స్థానికురాలు



విరిగిపోయిన కల్వర్టుపై రక్షణగోడ

శంకర్ ఫౌండేషన్ 'విజినరీ ఇన్‌సైట్స్'కు జాతీయ స్థాయి అవార్డు

ప్రజాశక్తి- వేపగుంట : ఉత్తరాంధ్ర జిల్లాల్లో నాణ్యమైన కంటి వైద్యసేలు అందిస్తున్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విజినరీ ఇన్‌సైట్స్‌లో ప్రచురించిన వార్తాలేఖ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) జాతీయ అవార్డుకు ఎంపికైంది. వచ్చేనెల 20 నుంచి 22 వరకు రాయపూర్‌లో నిర్వహించనున్న 46వ ఆల్ ఇండియా పబ్లిక్ రిలేషన్స్ కాన్ఫరెన్సలో శంకర్ ఫౌండేషన్‌కు అవార్డును బహూకరిస్తామని పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అజిత్ పాఠక్, సెక్రటరీ జనరల్ డాక్టర్ పిఎల్‌కె మూర్తి ప్రకటించారు. నేత్ర వైద్యరంగంలో తాజా పోకడలు, ఆవిష్కరణలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్రపై ప్రధానంగా దృష్టి సారించి శంకర్ ఫౌండేషన్ ప్రచురించిన వార్తాలేఖ జాతీయస్థాయి ద్వితీయ బహుమతికి ఎంపికైంది. ను ప్రచురించినందుకు శంకర్ ఫౌండేషన్ ఈ అవార్డు లభించింది. శంకర్‌ఫౌండేషన్‌కు జాతీయస్థాయి అవార్డుతో కీర్తి తీసుకొచ్చిన విజినరీ ఇన్‌సైట్స్ సంపాదకీయ బృందాన్ని, ఎడిటర్ కె.బంగారురాజును ట్రస్ట్ బోర్డు జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్, ఇతర సభ్యులు అభినందించారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం

ప్రజాశక్తి- సీతమ్మధార: ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు మంగళవారం జివిఎంసి 26వ వార్డు చాకలిపేట వద్ద రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, పరసర్ప సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతాయని తద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, వార్డు కార్పొరేటర్ ముక్కా శ్రావణి, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, మొక్క కిషోర్‌కుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

చలితో హాస్టళ్ల విద్యార్థులు గజగజ

తక్షణం రక్షణ చర్యలు చేపట్టాలి : ఎపిసిసి ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు

ప్రజాశక్తి- మాధవధార : రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు చలి తీవ్రత తట్టుకునేందుకు దుప్పట్లు, కార్పెట్లు, చాపలు పంపిణీ చేయకపోవడంతో నానా అవస్థలు పడుతున్నారనిలి ఎపిసిసి ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఒబిసి విభాగం ఇన్‌ఛార్జి మూల వెంకటరావు ఆరోపించారు. ఇప్పటికే పలు సంక్షేమ హాస్టళ్లు శిథిలావస్థకు చేరుకుని, కనీస సౌకర్యాలు లేక కునారిల్లిపోతున్నాయన్నారు. అనేక హాస్టళ్లకు కిటికీలు, ద్వారాలకు తలుపులే లేవన్నారు. ఈ నేపథ్యంలో రెండురోజులుగా గణనీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలు, చలితీవ్రతతో అనేక హాస్టళ్లలో కటిక నేలపై పడుకునే విద్యార్థులు నిద్రలేని రాత్రులను గడుపుతున్నారన్నారు. కొన్నిచోట్ల ఒకే దుప్పటిని ఇద్దరు ముగ్గురు విద్యార్థులు కప్పుకోవాల్సిన దుస్థితి ఉందన్నారు.చలి తీవ్రతకు విద్యార్థులు అస్వస్థతకు గురై అల్లాడిపోతున్నారన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, సంబంధితశాఖ మంత్రితోపాటు అధికారులు చొరవ చూపి, సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు చలి నుంచి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని వెంకటరావు కోరారు.

ప్రభుత్వమే విశాఖ డెయిరీని నడపాలి

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని, విశాఖ కోఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎస్ రమణ డిమాండ్ చేశారు. మంగళవారం డెయిరీ వద్ద కొనసాగుతున్న రిలే దీక్షల్లో మాట్లాడుతూ, ఉద్యోగ విరమణ చేసిన అధికారులు, డెయిరీలో విధులు నిర్వహించరాదన్నారు డెయిరీ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేవరకు ఆందోళనను కొనసాగించి, ఉధృతం చేస్తామని, దీనికి యాజమాన్యానిదే పూర్తి బాధ్యత అని హెచ్చరించారు యూనియన్ జాయింట్ సెక్రెటరీ నారాయణ, సంతోష్, వెంకట రమణ, గవర వెంకటరమణ, శంకరరావు పాల్గొన్నారు.

క్రీడా రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత : గంటా

ప్రజాశక్తి -భీమునిపట్నం : క్రీడలకు కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎస్‌విఎల్‌ఎన్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో రెండ్రోజుల పాటు జరుగనున్న ఆంధ్రా యూనివర్సిటీ అంతర్ డిగ్రీ కళాశాలల వాలీబాల్ పోటీలను బెలూన్లు ఎగరేసి ప్రారంభించారు. ఎయు పరిధిలోని విశాఖ, విజయనగరం జిల్లాల 35కాలేజీల నుంచి 35జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల అధ్యక్షత జరిగిన సభలో తహశీల్దార్ పి రామారావు, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి, వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారి లక్ష్మి, ఎయు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్ విజయమోహన్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి గౌరీశంకర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్ విష్ణుమూర్తి, గంటా నూకరాజు, గొలగాని నరేంద్రకుమార్, పలువురు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ ఎఎన్ఒగా చైతన్య

ప్రజాశక్తి- సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్‌లోని నావల్ వింగ్ సీనియర్ విభాగంలో బెస్ట్ అసోసియేట్ ఎన్‌సిసి ఆఫీసర్ (ఎఎన్ఒ)గా డాక్టర్ బుల్లయ్య కాలేజీ ఎన్‌సిసి విభాగం ఉప లెఫ్టినెంట్ టిఎన్..చైతన్య గుర్తింపు పొందారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 76వ ఎన్‌సిసి రైజింగ్ డే వేడుకల సందర్భంగా ఎన్‌సిసి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ నుంచి గౌరవాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చైతన్యను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్.కె. చక్రవర్తి, యుజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, పిజి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌విహెచ్. శ్రీకాంత్, మేజర్ బ్రహ్మానందరెడ్డి ఇతర ఎన్‌సిసి అధికారులు అభినందించారు.

పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న గండిబాబ్జి

ప్రజాశక్తి- పెందుర్తి: పంచగ్రామాల భూసమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని, ఆ దిశగా సిఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి అన్నారు. మంగళవారం జివిఎంసి 94, 95 వార్డుల పరిధి పురుషోత్తపురంలో చీర అప్పలరాజు ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీను, మాజీ సర్పంచ్ పిల్లల అప్పలనాయిడు, పార్టీ నాయకులు పిల్లల శ్రీనివాసరావు, బమ్మిడి బాలాజీ, గంట్ల దివాకర్, మామిడి కిరణ్, బమ్మిడి సత్తిబాబు,సూర్యనారాయణ, రోమాల శ్రీను, జొన్నాడ త్రినాథ్, దొరబాబు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ప్రజాశక్తి - ఆరిలోవ : జవిఎంసి 12వ వార్డు శ్రీలీలాసుందరయ్యనగర్‌లో రూ 57.85 లక్షల జివిఎంసి నిధులతో నిర్మించనున్న రెండు ప్రధాన కాలువ మరమ్మతు పనులకు మంగళవారం వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు శంకుస్థాపన చేశారు. పనులను త్వరితగతిన, నాణ్యతతో చేపట్టి, అందుబాటులోకి తేవాలని జివిఎంసి అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో ఇఇ శాంతిరాజు, డిఇఇ అప్పారావు, ఎఇఇ వెంకటరావు, స్థానిక సంఘం అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు పాల్గొన్నారు.

చిల్డ్రన్స్ పార్కులో ఆట వస్తువుల ఏర్పాటు

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం టి నగరపాలెం చిల్డ్రన్స్ పార్కులో చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.9లక్షలు విలువచేసే ఆట వస్తువులు, సిమెంట్ బల్లలు, రన్ మెష్, పలు ఆట వస్తువులు మంగళవారం ఏర్పాటు చేసినట్లు దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ తెలిపారు. పార్కులో ఆటవస్తువులు ఏర్పాటు చేసిన దివీస్ సంస్థకు సర్పంచ్ పొట్నూరు ఛాయా గౌతమి, ఎంపిటిసి పల్లా నీలిమ, గ్రామ పెద్దలు చంద్రశేఖర్, సన్యాసి రావు తదితరులు అభినందించారు. సిఎస్ఆర్ ప్రతినిధులు ఎ శ్రీనివాస్, శేఖర్‌బాబు పాల్గొన్నారు

అపరిశుభ్ర వాతావరణంలో మిడ్డే మీల్స్

● తోటగరువు ఉన్నత పాఠశాలలో పరిస్థితులపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజాశక్తి - ఆరిలోవ : పాఠశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో మధ్యాహ్న భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం చినగదిలి మండలం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు . పాఠశాలలో విద్యార్థులకు కల్పించిన వసతులు, ఇతర పరిస్థితులను పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథక అమలు తీరును, నాణ్యతను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో పిల్లలకు భోజనం వడ్డించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల క్రీడా స్థలం నిర్వహణ సరిగ్గా లేకపోవటం, ఇనుపరాడ్లు అడ్డదిడ్డంగా ఉండటాన్ని తప్పుబట్టారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా క్రీడా స్థలాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని, చెత్త డబ్బాలను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు.డిఇఒ ప్రేమ్ కుమార్, ఎంఇఒలు, ఇతర అధికారులు ఉన్నారు.

యుపిహెచ్‌సిలో ఓపి సంఖ్య పెరగాలి

ఆరిలోవ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, అక్కడ వైద్య సేవలను పరిశీలించారు. ఓపి సంఖ్య తక్కువగా ఉండడాన్ని గుర్తించి, పెంచాలని ఆదేశించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తగు సూచనలు చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి, రోగులకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు శృతిక



ప్రతిభ చూపిన విద్యార్థులతో పిఇటి

ప్రజాశక్తి-ఆనందపురం : జాతీయస్థాయి ఖోఖో పోటీలకు తమ పాఠశాల విద్యార్థిని రేగాని శృతిక ఎంపికైందని సిర్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పిఇటి బుత్తల సత్యం తెలిపారు.ఈ నెల 22 నుండి 25 వరకు గుంటూరు జిల్లా కారంపుడిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ -14 ఖోఖో పోటీల్లో పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రేగాని శృతిక, సారిక పవిత్ర, యర్ర హరిణి పాల్గొన్నారని, వీరు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో తృతీయస్థానంలో నిలిచారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన శృతిక వచ్చే నెలలో మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో ఆంధ్రా జట్టు తరుపున పాల్గొంటుందన్నారు. ఖోఖోలో ప్రతిభ చూపిన విద్యార్థులు, పిఇటిసత్యంను హెచ్ఎంతోపాటు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కోరాడ గౌరి, వైస్‌చైర్మన్ సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు, ఎంపిటిసి బోని అప్పలనాయుడు, మాజీ చైర్మన్ బుర్లి వెంకటరమణ, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు భరత్



ఫుట్‌బాల్‌లో ప్రతిభ చూపిన భరత్

భీమునిపట్నం : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా, హిందూపురంలో జరిగిన అండర్-14 ఫుట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన విశాఖ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ఎ.భరత్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చిట్టివలస శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ కార్యదర్శి అక్కర మాని చినబాబు తెలిపారు. భరత్‌ను అభినందించి, జాతీయపోటీల్లో రాణించాలని పలువురు ఆకాంక్షించారు.

50 మందికి దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు, చీరలు పంపిణీ చేస్తున్న దాత చంద్రావతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కళా సాహితీ సంస్థ సభ్యులు ఉసిరికల చంద్రావతి ఆర్థిక సాయంతో కొనుగోలు చేసిన 50 దుప్పట్లను మంగళవారం భీమిలిలో వృద్ధులకు, ఒంటరి మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాభావంతో చలితో అల్లాడిపోతున్న పేదలకు రక్షణగా ఉండేందుకు దుప్పట్లు పంపిణీ చేసిన చంద్రావతిని సాహితీ సంస్థ అధ్యక్షులు పిఆర్‌పి వర్మ అభినందించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగించాలని ఆకాంక్షించారు. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది సామాజిక సేవకు ముందుకు రావాలన్నారు.

కోసిన వరి చేనును కుప్పలు వేయాలి

ప్రజాశక్తి- భీమునిపట్నం : తుపాను హెచ్చరికల నేపథ్యంలో కోసిన వరిచేనును కుప్పలు వేసుకోవాలని ఎఒ బి.శివకోమలి రైతులకు సూచించారు. ఇప్పటికే నూర్పిడి అయిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లు యజమానుల నుంచి రసీదు పొందాలన్నారు. రైస్ మిల్లులకు అందజేసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. వరికోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు.

మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు

● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ● బోనిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి మద్దతు ధరను అందిస్తుందని స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం మండలంలోని బోని గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా పంట కొనుగోలు,డబ్బులు చెల్లింపుపై అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చిందన్నారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ మాట్లాడుతూ కల్లాల్లోనే ధాన్యం తేమ శాతం తెలుసుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నా మన్నారు. కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులకు వెళ్లే వరకు జిపిఎస పర్యవేక్షణ ఉంటుందన్నారు. పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత మాట్లాడుతూ రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి నగదు మూడు రోజుల్లోనే వారి ఖాతాలకు జమ చేస్తామన్నారు. కేంద్రానికి ధాన్యం తెచ్చేందుకు రవాణా, గోనె సంచులు, కూలీ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. సాధారణ రకం ధాన్యం క్వింటాళ్లకు రూ.2300, గ్రేడ్ ఏ రకం ధాన్యాన్ని రూ. 2320 ప్రభుత్వం మద్దతుధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో భీమిలి ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్, డిఎస్‌ఒ వి.భాస్కరరావు, డిసిటిఒ టి.ప్రవీణ, డిఎఒ కె అప్పలస్వామి, ఎపిఎంఐపి డిఎం మన్మధరావు, భీమిలి ఎడిఎ బొడ్డేపల్లి విజయప్రసాద్, ఎఒలు సిహెచ్. సంధ్య రత్నప్రభ, బి శివకోమలి, కంటుభుక్త రామానాయుడు, స్థానిక మాజీ సర్పంచ్ సురాల సత్య వరప్రసాద్, నాయకులు బిఆర్‌బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, గనరెడ్డి రమేష్, బంటు చిన్న, బి చంటి, మీసాల సత్యనారాయణ, క్రోతు సత్యం, అంగటి రాము, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు

మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమం

ఐద్వా ఆధ్వర్యాన ర్యాలీ, సదస్సు



మాట్లాడుతున్న ఐద్వా జోన్ కార్యదర్శి విమల

ప్రజాశక్తి -ములగాడ: మహిళలపై హింసకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఐద్వా విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి పిలుపునిచ్చారు. మంగళవారం మల్కాపురం సిఐటియు కార్యాలయంలో ఐద్వా మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలపై హింసకు వ్యతిరేకంగా బి.మమత అధ్యతన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ, మహిళలపై వివిధ రూపాల్లో హింస జరుగుతున్నా వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని దుయ్యబట్టారు. మహిళలపై హింసలేని సమాజ సాకారానికి కృషి చేద్దామన్నారు. ఐద్వా జోన్ కార్యదర్శి ఆర్.విమల మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరకడంతో యువత వాటికి బానిసలై పలు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో .ఐద్వా జోన్ నాయకులు వై.కళ్యాణి, బి.రాజేశ్వరి, పి.వరలక్ష్మి, అన్నపూర్ణ, బి.లక్ష్మి, నిర్మల, అరుణ, విజయ, ఆదిలక్ష్మి, కళావతి గోవిందమ్మ పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

● 28న గీతంలో నిర్వహణ ● 27న స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్, హ్యాక్‌థాన్



సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ ఘోష్

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్త ఆధ్వర్యాన ఈనెల 28 నుంచి వచ్చేనెల ఒకటి వరకు వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకానమీపై 14వ అంతర్జాతీయ సదస్సును గీతం వర్సిటీలో నిర్వహించనున్నట్లు సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె ఘోష్ తెలిపారు. మంగళవారం సదస్సు కన్వీనర్లు, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ సాయిసుధాకర్, డాక్టర్ సౌదామినిలతో కలిసి విలేకర్లతో మాట్లాడుతూ, వివిధ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలతోపాటు రోజువారీ జీవితంలో వినియోగించే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్, ఆసుపత్రి వ్యర్థాలను రీసైక్లింగ్ పద్ధతులతో పునర్వినియోగానికి తెచ్చి, కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమీ అంటారన్నారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, సర్క్యులర్ ఎకానమీ, ఐపిఎల్ఎ గ్లోబల్ ఫోరమ్-2024 పేరిట జరిగే సదస్సులో 60 దేశాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, వివిధ రంగాల నిపుణులు 580 పరిశోధన పత్రాలను సమర్పించనున్నారని తెలిపారు. ఈజిప్ట్, నార్వే, జపాన్, అమెరికా దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు కీలక ఉపన్యాసాలు చేస్తారన్నారు. సదస్సులో భాగంగా ఈనెల 27న నిర్వహించే స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్‌లో దేశంలోని 25 పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరికొత్త పద్ధతులను, వాణిజ్య సమూనాలను ఉపయోగిస్తున్న పరిశ్రమలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను అందజేస్తామన్నారు. సదస్సులో భాగంగా పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. వ్యర్థాలను సమర్థంగా నిర్వహించిన ప్రపంచంలోని 52 సంస్థలకు సదస్సులో అవార్డులు అందించనున్నామని సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె ఘోష్ తెలిపారు. వ్యర్థాల నిర్వహణపై విశేష కృషి, పరిశోధనలు జరుపుతున్న వ్యక్తులను గుర్తించి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులను అందజేస్తామన్నారు. సదస్సు తీర్మానాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

బస్ సౌకర్యం కల్పించాలని వినతి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పెందుర్తి : నరవలోని బెహారా ఇంజినీరింగ్ కాలేజీ, విశాఖ కాలేజీ విద్యార్థులకు కాలేజీ వేళల్లో బస్‌సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ పిడిఎస్‌ఒ ఆధ్వర్యంలో మంగళవారం ద్వారకానగర్ బస్‌కాంప్లెక్స్ వద్ద నిరసన చేపట్టారు. ఆర్‌టిసి ఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పిడిఎస్‌ఒ రాష్ట్రకమిటీ సభ్యులు ఎస్.రుద్ర మాట్లాడుతూ, ఈ రెండు కాలేజీల్లో వందల మంది విద్యార్థులు చదువుతున్నారని, అయితే కాలేజీలకు వెళ్లేందుకు బస్సులు లేక 10-15కిలోమీటర్లు సైకిళ్లమీద, ఆటోల్లో రోజువారీ ఛార్జీలను చెల్లించి వెళుతూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. 300ఎస్ సిటీ బస్ తిరుగుతున్నా కాలేజీ విద్యార్థులకు ప్రయోజనం లేదన్నారు. ఉదయం, సాయంత్రం కాలేజీ సమయాల్లో బస్సులు నడపాలని వేడుకున్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌ఒ సభ్యులు మహేంద్ర, రోహిత్ పాల్గొన్నారు.

క్వారీల్లో జాగ్రత్తలు పాటించాలి

అనకాపల్లి డిఎస్‌పి శ్రావణి

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రమాదకరమైన క్వారీల్లో యాజమాన్యం తగిన జాగ్రత్తలు పాటించాలని అనకాపల్లి డిఎస్పి శ్రావణి సూచించారు. అనకాపల్లి సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అనకాపల్లి, వి.మాడుగుల, రావికమతం, రోలుగుంట, కొత్తకోట మండలాలలో గల క్వారీ యజమానులు, ట్రాన్స్‌పోర్టర్స్‌తో అనకాపల్లి డిఎస్పి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. క్వారీల్లో బ్లాస్టింగ్ నిర్దిష్ట అనుమతి ఉన్నవారు మాత్రమే చేయాలని, బ్లాస్టింగ్ చేసే సమయానికి ముందుగా సమీప గ్రామ ప్రజలకు తెలియజేయాలని, బ్లాస్టింగ్ వైపు జనసంచారం లేకుండా రెండువైపులా మనుషుల్ని పెట్టి ఆపాలని సూచించారు. ఎటువంటి ప్రమాదాలు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్వారీలో ఉండే సిబ్బంది తగిన భద్రతాపరమైన చర్యలు చేపట్టాలని, పేలుడుకు ఉపయోగించే ఐఈడీలు పట్ల తగిన జాగ్రత్త వహించాలని, అవి పక్కదారి పట్టకుండా చూడాలని సూచించారు. ట్రాన్స్ పోర్ట్ వారిని గురించి మాట్లాడుతూ లారీలు వెళ్లేటప్పుడు స్పీడ్ తగ్గించుకోవాలన్నారు. స్కూల్ టైమింగ్స్‌లో లారీలని టౌన్‌లోకి ప్రవేశం నిషిద్ధమని, మిగతా టైమింగ్స్‌లో లారీలు పరిమితిలో లోడ్ వేసుకొని, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఎటువంటి ప్రమాదాలు జరగకుండా డ్రైవర్ల అప్రమత్తంగా నడపాలని కోరారు. పై జాగ్రత్తలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి రూరల్ సిఐ జి.అశోక్ కుమార్, ట్రాఫిక్ సిఐ ఎం వెంకటనారాయణ, కొత్తకోట సిఐ జి కోటేశ్వరరావు, అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి రవికుమార్, వి.మాడుగుల ఎస్ఐ జి నారాయణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రావణి

లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : ఆడ మగ తేడా లేకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను సంరక్షించాలని ఎంపీడీవో వి విజయలక్ష్మి అన్నారు. జెండర్ ఆధికారిక హింసకు వ్యతిరేకంగా మండల మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అమరపిన్ని వరలక్ష్మి, వివిధ గ్రామాలకు చెందిన గ్రామాఖ్య సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ఆర్యభట్ట విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం : అనంతపురం జిల్లాలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగిన రాష్ట్రస్థాయి 43వ జూనియర్, సబ్ జూనియర్స్ షూటింగ్ బాల్ పోటీల్లో మండలంలోని ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అనకాపల్లి జిల్లా తరపున బాలుర జూనియర్ టీం నుంచి 12మంది, బాలికల టీం నుంచి 12 మంది, సబ్ జూనియర్స్ జట్టు నుండి 12 మంది బాలురు బాలికల జట్టు నుండి 12 మంది పాల్గొన్నారు. జూనియర్ విభాగాల్లో బాలురు-3వ స్థానంలో, బాలికలు-2వ స్థానంలో సబ్ జూనియర్స్ బాలురు-3వ స్థానం, బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు.

28 నుంచి డిఎస్‌సికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి అనకాపల్లి శ్రీగౌరీ గ్రంథాలయంలో మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి, మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కేంద్రం డైరెక్టర్ కె.రాజేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలోని అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ కులాలకు చెందిన అభ్యర్థులు త్వరితగతిన దరఖాస్తులు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులు బయోడేటా, పది, ఇంటర్, డిగ్రీ మార్కుల జాబితాలు, టీటీసీ, బెటెట్‌లలో సాధించిన అర్హత మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, (తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష లోపు), ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం నకలు, రెండు పాస్‌పోర్టు ఫోటోలతో దరఖాస్తులను పట్టణంలోని సర్వేపల్లి రాధాకృష్ణ జూనియర్ కళాశాల పక్కన డోర్ నెం. 10-06-31/7 చిరునామాలో ఉన్న బీసీ సంక్షేమ శాఖ కార్యాలయానికి దరఖాస్తులు అందజేయాలని ఆమె కోరారు. వివరాలకు 9885845743 మొబైల్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు. ఈ శిక్షణ రెండు నెలలు ఉంటుందని, టెట్‌లో మెరిట్ ప్రాతిపదికన రిజర్వేషన్‌కు అనుగుణంగా శిక్షణకు అభ్యర్థులను ఎంపిక చేస్తామని చెప్పారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 14 శాతం, ఇబీసీలకు 10 శాతం చొప్పున సీట్లు కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు. బయోమెట్రిక్ హాజరు నమోదుతో శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలం మొత్తానికి అభ్యర్థులకు నెలకు రూ.1500 స్టైపెండ్, డీఎస్సీ మెటీరియల్ కోసం రూ.1000 అందజేస్తామన్నారు. శిక్షణకు 75 శాతం హాజరు ఉండాలన్నారు. బోధనా రంగంలో అనుభవం ఉన్న అధ్యాపకులు కేంద్రీకృత శిక్షణ ఇస్తారన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సురేంద్ర కుటుంబం

ప్రజాశక్తి-అనకాపల్లి : తిరుమల వెంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్స్ కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. టిటిడి బోర్డు మాజీ చైర్మన్ మైదుకూరు నియోజకవర్గం శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రగడ నాగేశ్వరరావుకు సత్కారం



ప్రగడను గజమాలతో సత్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-మునగపాక

ఏపీఆర్‌డిసి చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావును మండలానికి చెందిన పలువురు టిడిపి నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో ఆయనకు గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సాయికృష్ణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాసరావు, తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆడారి మంజు, పెంటకోట విజయ్, విల్లూరి నర్సింగరావు, జానకి, లక్ష్మణరావు, శ్రీరామమూర్తి కార్యకర్తలు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కశింకోట : విజయవాడలోని ఆర్ అండ్ బి కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ప్రగడ నాగేశ్వరరావుకు పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, కూటమి నాయకులు పరమేశ్వర రావు, కోట్ని బాలాజీ, గొంతిని శ్రీనివాసరావు, సైనంశెట్టి రమణారావు, నారిపల్లి ప్రసాద్రావు, గెంజి కుమార్ ఉన్నారు.

ఎన్‌పిసిఐ ఖాతాలు తెరవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలసంక్షేమ పథకాలను నేరుగా నగదు రూపంలో లబ్ధిదారులు పొందటానికి ఆధార్ అనుసంధానంతో కూడిన ఎన్‌పిసిఐ ఖాతాలను పోస్ట్ ఆఫీస్‌లో తెరవాలని పోస్టల్ డిపార్ట్మెంట్ అనకాపల్లి డివిజన్ సూపరిండెంట్ కే శ్రీనివాస్ మంగళశారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌తో ఎన్‌పిసిఐ ఖాతాలో తెరవడం తెలియక లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అనకాపల్లి డివిజన్లో 2.6 లక్షల మంది లబ్ధిదారులు ఉండగా పోస్ట్ ఆఫీస్ ద్వారా 25000 మంది ఎన్‌పిసిఐ అనుసంధానంతో ఖాతాలు ప్రారంభించారని తెలిపారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ సర్వీస్ ద్వారా ఆధార్ అనుసంధానం తీసుకునే అవకాశం పోస్టల్ శాఖ కల్పించిందన్నారు. రాబోయే రోజులలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమవుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమీపంలో ఉన్న పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లి ఆధార్ అనుసంధానంతో కూడిన ఎన్‌పిసిఐ ఖాతాలను ప్రారంభించాలని సూచించారు.

ప్రేమ సమాజానికి సరుకులు అందజేత

ప్రజాశక్తి-కశింకోట : భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా మూడవ రోజు కొక్కిరపల్లి ప్రేమ సమాజానికి నెల రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు, పిల్లలకు బిస్కెట్లు, చాక్లెట్లు, హార్లిక్స్, బూస్ట్, స్నేక్స్ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఉగ్గిని రమణమూర్తి, ఉల్లింగల రమేష్, మళ్ల బాబు, గొంతిని చిరంజీవి, మజ్జి సూర్యప్రకాష్, తిర్రి చిరంజీవి పాల్గొన్నారు.


1న మహా ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం డిసెంబర్ 1 తేదీన విశాఖపట్నం కుర్మన్నపాలెం జంక్షన్ వద్ద బిఎస్‌పి ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ సూదికొండ మాణిక్యాలరావు పిలుపునిచ్చారు. స్థానిక కోడుగంటి గోవిందరావు భవన్లో మంగళవారం జరిగిన సమావేశంలో బిసి సంఘం రాష్ట్ర నాయకులు విల్లూరి పైడారావు, ఆమ్ ఆద్మీ పార్టీ ఇంచార్జ్ కొణతాల హరినాథ్ బాబు, అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యులు బొడ్డేడ అప్పారావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బొట్టా యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్ కుమార్, ఫోరం ఫర్ సోషల్ రైట్స్ జిల్లా అధ్యక్షులు కొల్లి చిన అప్పారావు, ప్రజాసంఘాల నేతలు బొడ్డు సోమరాజు కోరుబిల్లి శంకర్రావు బుగడ అప్పారావు, కొల్లి సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో పార్కింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, గోవిందరాజు పాల్గొన్నారు.

మేకా సూరిబాబు వర్థంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని సందర్శించిన ఎస్ఐ తారకేశ్వరరావు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ అజయ్ ప్రవంత్

ప్రజాశక్తి-గొలుగొండ

గిరిజనోద్యమ నేత, సిపిఐ నాయకులు కామ్రేడ్ మేకా సూరిబాబు 37వ వర్థంతి సందర్భంగా ఆయన మనవడు, శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ అజయ్ ప్రవంత్ ఆధ్వర్యంలో గొలుగొండ మండలం పాత కృష్ణదేవిపేట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక, జనసేన పార్టీ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 200 మంది రోగులకు డాక్టర్ అజయ్ ప్రవంత్‌తో పాటు జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ మణిదీప్ రెడ్డి, ఎముకులు వైద్య నిపుణులు డాక్టర్ సాయికృష్ణ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు పంపిణీ చేశారు. మేకా సూరిబాబుపై ఉన్న అభిమానంతో జెకె.వీధి మండలం జెర్రిల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న వైద్య సిబ్బంది ఈ వైద్య శిబిరానికి వచ్చి రక్త పరీక్షలు చేయడంతో పాటు ఇతర వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని ఎస్ఐ వై.తారకేశ్వరరావు సందర్శించి మాట్లాడారు. దూర ప్రాంతాలకు వెళ్లి వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో దోహదపడతాయని చెప్పారు. వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా సేవలు అందించిన డాక్టర్ అజయ్ ప్రవంత్‌ను, మిగిలిన వైద్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ సహదేవుడు, జనసేన నాయకులు ఊడి చక్రవర్తి, పంచాడ హరినాథ్, సర్పంచ్ పందిరి సత్యనారాయణ, మాజీ ఎంపిటిసి నాగేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ గోపి, ఆర్‌ఎంపి వైద్యులు లక్ష్మణరావు, మేకా సూరిబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మేకా సూరిబాబు వర్ధంతి

సిపిఐ నాయకులు కామ్రేడ్ మేకా సూరిబాబు 37వ వర్థంతి సందర్భంగా మండలంలోని పాత కేడీపేటలో ఆయన స్థూపం వద్ద ఆ పార్టీ నాయకులు, సూరిబాబు కుటుంబ సభ్యులు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు మాట్లాడుతూ గిరిజన, మైదాన ప్రాంతాల ప్రజలు హక్కులకై జరిగిన పోరాటాల్లో సూరిబాబు ప్రధాన పాత్ర వహించాలని చెప్పారు. ఆయన ఆశయ సాధనకు పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేకా సత్యనారాయణ, శివలంక కొండలరావు, భాస్కరరావు, గురుబాబు, లగుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులు లీక్

వృథాగా పోతున్న నీరు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని మోసయ్యపేట పంచాయితీ పరిధిలో తాగునీటి పైపులు లీకై తాగునీరు వృథాగా పోతుంది. అనకాపల్లి రోడ్డులో సుందరం హోటల్ ఎదురుగా కుళాయి పైపులు శిథిల అవస్థకు చేరాయి. పైపులను మార్చాల్సి ఉంది. పైపులు జాయింట్లు వదిలి కన్నాలు పడి నీరు వృథాగా పోతుంది. దీనిపై అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. నీరు వృథాగా పోతే రానున్న కాలంలో మంచినీటి సమస్య తీవ్రమవుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చెందుతున్నారు.



వృథాగా పోతున్న తాగునీరు



దోమల మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

దోమల నివారణ మందు పిచికారీ

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం పంచాయతీ 10వ వార్డ్ మెంబర్ నేమల ధనలక్ష్మి హరి ఆధ్వర్యంలో మంగళవారం బానయ్యకోనేరు వీధి పరిసర ప్రాంతాలలో నీరు నిల్వ ఉన్న చోట దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ చోడవరంలోని మురికివాడలో నివసిస్తున్న పేదలు అపారిశుధ్య వాతావరణంలో నివసిస్తున్నారని, డెంగీ మలేరియా వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గ్రాఫర్ కోటి తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని జివిఎంసి 88వ వార్డు పరిధి వెదుళ్ల నరవ రెవెన్యూలో భూఆక్రమణలను తొలగించినట్లు మండల తహసీల్దార్ బి.చిన్నికృష్ణ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెదుళ్ల నరవ రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 102లో 3 ఎకరాల 87 సెంట్లు ప్రభుత్వ గెడ్డ వాగు ఆక్రమణకు గురి కావడంతో వాటిని తొలగించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే సర్వే నెంబర్ 118లో ప్రభుత్వ భూమి గయాలు ఆక్రమణ చేసి ప్రహరీ నిర్మించగా, వాటిని తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ఎల్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో ఎం.గోవిందరావు, సచివాలయం సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గాలమ్మ ఆలయానికి వెండి బహూకరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలోని శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి ఆలయానికి సబ్బవరం సిఐ పిన్నింటి రమణ అర కేజీ వెండిని ఆలయ కమిటీ నిర్వాహకులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, కోరాడ శ్రీనివాసరావు, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను, ముర్రి కనకరాజు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుపై అవగాహన

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం గ్రామంలో కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన శ్రీకాకుళం జిల్లా జిల్లా ఎచ్చెర్లకు చెందిన కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్ర స్థాయి శిక్షణలో భాగంగా మంగళవారం రైతులకు వరి సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ యన్.రాజ్‌కుమార్, డాక్టర్ యన్ సతీబాబు, డాక్టర్ యన్.కిషోర్, డాక్టర్ ఎ.సౌజన్య, ఈఆర్ పి.బాబు సలహామేరకు రైతులకు స్టిక్కీ ట్రాప్స్ వలన కలిగే ప్రయోజనాలను వివరించారు కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు బి.శివాని, కే.స్నేహిత, జి.తేజస్విని, ఎ.వాసవి పాల్గొన్నారు.

తుమ్మపాలలో భారీ అన్న సమారాధన

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీక మాసం నాల్గవ సోమవారం సందర్భంగా తుమ్మపాల శివాలయం వద్ద భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. శివా యూత్ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ అన్న సమారాధనను జనసేన నియోజకవర్గ ఇన్చార్జ్ భీమరౌట్ రాంకీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆయనను సత్కరించింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



జనసేన నేత రాంకీని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలి

యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి

ప్రజాశక్తి-అనకాపల్లి : మహిళలు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించాలని అఖిలభారత యువజన కాంగ్రెస్ కార్యదర్శి, ఏపీ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ మమతా నాగిరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ సమీక్షా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం కోసం వారికి శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. దేశంలో మత్తు పదార్థాలు విరివిగా దొరుకుతున్నాయని, యువత మత్తుకు బానిసలుగా మారి వారి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్తు ముడుపుల వ్యవహారంలో ఆదాని సంస్థలను కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ సంవత్సరానికి 20 లక్షల ఉద్యోగాల కల్పనలో పూర్తిగా విఫలమైందన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ మహిళలకు చట్ట సభల్లో అధిక శాతం అవకాశం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శివ, జిల్లా అధ్యక్షులు బి.కిషోర్, నాయకులు బి.బాల మురళి, బి.నరసింగరావు, శ్రవణ్ కుమార్, గౌరి నాయుడు, భాను, అఖిల్, పి.నరసింగరావు, ఎస్.నాగరాజు, మలపు రెడ్డి కోటేశ్వరరావు, తుట్ట రమణ, కాళ్ళ సత్యనారాయణ, బోయిన భాను మూర్తి యాదవ్, బొంతు రమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మమతా నాగిరెడ్డి

రెవెన్యూ సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి 14 రోజులు రిమాండ్

ప్రజాశక్తి-పరవాడ : రెవెన్యూ సిబ్బందిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షేక్ ఇస్మాయిల్‌పై పోలీసులు కేసులు నమోదు చేసి సోమవారం కోర్టుకు హాజరు పరచగా అతనికి 14 రోజులు రిమాండ్ విధించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండల కేంద్రం పరవాడ గ్రామానికి చెందిన షేక్ ఇస్మాయిల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆనుకొని గవర్నమెంట్ స్థలంలో ఏర్పాటు చేసిన మాంసం దుకాణం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, పరవాడ తహసీల్దార్ అంబేద్కర్‌కి అందిన ఫిర్యాదు మేరకు ఈనెల 22న రెవెన్యూ సిబ్బంది ఆ మాంసం దుకాణాన్ని తొలగించారు. అనంతరం పరవాడ విఆర్ఓ జి.సత్యనారాయణ డ్యూటీ నిమిత్తం పరవాడ ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్తుండగా, మార్గమధ్యలో పరవాడ బీసీ కాలనీ వద్ద ఇస్మాయిల్, ఆయన తల్లి పాతిమా బేబీ తనను ఆపి విధులకు ఆటంకం కలిగిస్తూ, అనుచిత వ్యాఖ్యలు చేసి బెదిరించారని ఆరోపిస్తూ వీఆర్ఓ పరవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు కేసు నమోదు చేయగా, ఎస్సై బి కృష్ణారావు దర్యాప్తు నిర్వహించి, ఇస్మాయిల్‌ను సోమవారం అరెస్టు చేశారు. అనంతరం అనకాపల్లి 11 అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా కోర్టు ఇస్మాయిల్‌కు 14 రోజుల రిమాండ్ విధించింది. ఇస్మాయిల్ తనను పత్రికా విలేకరిగా చెప్పుకుంటూ సోషల్ మీడియాలో రెవెన్యూ, పోలీసు అధికారులు, ఇతర ప్రజలపై నిరాధార ఆరోపణలతో, తప్పుడు కథనాలు ప్రచురిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నట్లు కేసు విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు.



తహశీల్దారుకు రాజ్యాంగం పుస్తకం అందిస్తున్న దేవుడు, ప్రసాద్

అధికారులకు రాజ్యాంగ పుస్తక ప్రతులు అందజేత

ప్రజాశక్తి-చోడవరం : రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ లెక్చరర్ ఎన్.దేముడు, అంబేద్కర్ ట్రస్ట్ సభ్యులు వరప్రసాద్ రాజ్యాంగ పుస్తక ప్రతులను స్థానిక సిఐ పి.అప్పలరాజు, తహశీల్దారు ఎ.రామారావు, ఎంపీడీవో ఆంజనేయులు తదితరులకు మంగళవారం అందజేశారు.

ఉత్సాహంగా ఆర్చరీ పోటీలు

ప్రజాశక్తి-పరవాడ : జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో సంస్కృతి గ్లోబల్ స్కూల్‌లో మంగళవారం జిల్లా స్థాయి సీనియర్ ఆర్చరీ పోటీలు జరిగాయి. వీటిని పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుండి సుమారు 30 మంది క్రీడాకారులు హాజరై పోటీలలో పాల్గొన్నారు. వీరిలో రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చే నెల 3 నుండి 5 వరకు విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని విశాఖపట్నం జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు విశాఖ జిల్లా నుండి ఎంపికైన అమ్మాయిలు, అబ్బాయిలు బైరెగి నాయుడు, సుధాకర్ నాయుడు, సాయి కృష్ణమ నాయుడు, యస్వంత్ నాయుడు, సాయి మనస్విని, సాహితీ, చిన్మాయ్ శ్రీజ, వైష్ణవి, ఆద్య, అరియనా, గణేష్ మణిరత్నం, హర్షవర్ధన్, సాయికృష్ణమరాజు, గణేష్ నాయక్, సాంబశివ, ప్రశాంత్, హరీష్ చంద్ర, గౌతమ్ బుద్ధదేవాలకు, కోచ్‌లు ఎల్.సూరిబాబు, కె. గోవింద్, వి. శివకుమార్‌లకు జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్షులు పి. సూర్య నారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ అభినందనలు తెలిపారు.

9న జీవిత బీమా ఏజెంట్ల సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

జీవిత బీమా ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 9వ తేదీన డివిజన్ కార్యాలయం వద్ద భారీ స్థాయిలో ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్లు ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా డివిజన్ ప్రెసిడెంట్ ఎం నాగరాజు తెలిపారు. స్థానిక ఏఓఐ యూనియన్ కార్యాలయం వద్ద మంగళవారం అనకాపల్లి బ్రాంచ్ ఏఓఐ యూనియన్ అధ్యక్షులు పెంటకోట పైడి నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఐఆర్డీఏఐ అడ్డుపెట్టుకొని ఎల్ఐసిలో తీసుకొస్తున్న హానికరమైన మార్పులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అన్ని డివిజన్లు కార్యాలయం వద్ద ధర్నాలకు ఎల్ఐసి ఏఓఐ కేంద్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. క్లబ్లక్ నిబంధన రద్దు కోసం సర్కులర్‌ని అధికారికంగా ప్రకటించాలని, ఇన్సూరెన్స్ పాలసీపై ఉన్న జీఎస్టీని తొలగించాలని, గ్రాడ్యుటీపై ఉన్న సీలింగ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి హెల్త్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, బీమా సుగం, బీమా వాహక్, బీమా విస్తార్ ప్రతిపాదనలను రద్దు చేయాలని, ఏజెంట్లకు ఈఎస్ఐ, ఈపీఎస్ సౌకర్యం కల్పించాలని కోరారు. డివిజన్ ఆఫీస్ వద్ద ధర్నాలు, పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు, కోటి సంతకాల సేకరణ, ఫిబ్రవరి 11న చలో పార్లమెంటు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గొర్లి శంకర్రావు, కె.వి రమణ, ఎస్ శ్రీనివాసరావు, పి నూకరాజు, పీలా శ్రీనివాసరావు, రమణ బాబు, ఈశ్వరరావు, మాణిక్యాలరావు, శ్రీరామ్మూర్తి, అప్పాజీ, పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

ప్రజాశక్తి-చోడవరం : జిల్లా, రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన చోడవరం క్రీడాకారులను స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. చుక్కల లాస్య, వి.ఇసిత శారదా, కె.కార్తికేయ రాష్ట్ర స్థాయిలో కాంస్య పతకాలు, సూహాన్, ఎ పూజ శ్రిత, కె రాజ్ కుమార్, చారిక్ మోహిత్, కృతి, షర్మి, బరద్వాజ్, యస్ జ్ఞానవి, బి.జ్యోస్నిత, ఎ దేవాన్స్, యస్ ప్రియాంజన్ సాయి, యస్ జనీత్ కుమార్, బి యొదాదిత్య భార్గవ్, పి జశ్వంత్, యస్ విజయేందర్‌లు జిల్లా స్థాయిలో బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులతో పాటు కోచ్‌లు నోకియా ప్రసాద్, గండి శేఖర్‌లను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పల్లం మురళీకృష్ణ పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



రెల్ల రాల్చు పురుగు పట్టిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-కశింకోట : వరి పంటలో రెల్ల రాల్చు పురుగు పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. కశింకోట మండలంలో మంగళవారం అనకాపల్లి డయాగ్నొస్టిక్ టీమ్ సభ్యులు వరి పంటలను పరిశీలించారు ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటలో రెల్ల రాల్చు పురుగు నష్టం కలగజేస్తుందని, దీని నివారణ కోసం వరి కోతకు 15-20 రోజుల సమయం ఉన్న పంటకు వేపనూనె 5 మిల్లీలీటర్‌తో పాటు క్లోరిపైరిపాస్ లేదా ప్రొపినోపాస్ మందును 2 మిల్లీ లీటర్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వరి కోత అయిన తర్వాత పనల మీద కూడా ఈ పురుగు నష్టపర్చుతుందని, దీనికి వేప నూనె ను 5 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త ఆర్.సరిత, డిఆర్‌సి పి.వేజేత, ఏఇ ఓ నూక శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలం పిలుస్తుంది..

మండలంలోని చింతలపాలెం, జెడ్.తుని గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రబీ పంటలకు సంబంధించి వరి పంటకు ఎకరాకు రూ.630, మినుము పెసర పంటలకు రూ.300 పంటలు బీమా పథకం కింద సిఎస్‌సి సెంటర్‌లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న సూచించారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరంలో శివాలయం నిర్మాణానికి ఆ గ్రామానికి చెందిన గండేపల్లి అప్పలనరసయ్య, సీత దంపతులు రూ.15,350 విరాళాన్ని మంగళవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను, ఆలయ కమిటీ నిర్వాహకులుపాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అనకాపల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పలుచోట్ల రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అధికారులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామరాజు, ఎంపిపి రత్నం, సర్పంచ్‌లు జయ రత్నకుమారి, షేక్ మునిషా బేగం, శంకర్రావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెంకటేష్, ఇన్చార్జ్ ఈవోపీఆర్డీ శ్రీను పాల్గొన్నారు. పెదబోదుగల్లం హైస్కూలులో హెచ్.ఎం. చోడిశెట్టి సత్యనారాయణ అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పించారు.నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కే. శ్రీదేవి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో ఎస్ఐ సన్నిబాబు పాల్గొన్నారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్దన్ రావు వేడుకలు నిర్వహించారు.

నక్కపల్లి :రాజ్యాంగం కల్పించిన హక్కులు వినియోగించుకోవాలని అడ్వకేట్ జి.పి. మధురా గ్రేస్ అన్నారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నర్సీపట్నం టౌన్:మండలంలో చెట్టుపల్లిలో రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు యర్రం శెట్టి పాపారావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ రమణ, డిహెచ్పిఎస్ లోవరాజు, కృష్ణ రెల్లి సంఘం నాయకులు పరపతి రామ్మోహన్‌రావు, సత్తిబాబు, ట్రేడ్ యూనియన్ నాయకులు మోపాడ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

కోటవురట్ల:ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కొత్తకోట:రావికమతంలో ఎంపీడీఓ బానోజీరావు, కొత్తకోటలో సర్పంచ్ కొన లోవరాజులు అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కొత్తకోట అంబేద్క ర్ కాలనీ లో విగ్రహానికి సంఘ నాయకులు మల్లేటి రాజు, పూడి అప్పారావు, ఎంపిటిసి సభ్యులు దేవ నివాళ్లు అర్పించారు.

చీడికాడ :మండలంలో ఆదర్శ పాఠశాల, కాలేజీలో రాజ్యాంగం దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి పాల్గొన్నారు. గ్రంధాలయంలో లైబ్రేరియన్ జోగేశ్వరి రాజ్యాంగ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు

మాడుగుల:రాజ్యాంగాన్ని ప్రతీ ఒక్కరు గౌరవించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. మాడుగులలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,ప్రస్తుతం రాష్ట్రంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేస్తున్నారన్నారు. ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి ఉపసర్పంచ్ వరహాలు, ఎంపిటిసీలు కుక్కర మహేశ్వరి, పొలిమేర విజయలక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడీవో కొంకి అప్పారావు, ఎంపీపీ రాజారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు.

గొలుగొండ:స్థానిక శాఖా గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రంథాలయాధికారి రాజుబాబు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల విద్యాలయ ఉపాధ్యాయులు రాముసాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

గొలుగొండ: ఏఎల్.పురం మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి కే.శ్రీనివాసరావులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చింతల వాసుదేవరావు పాల్గొన్నారు.

అనకాపల్లిభారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని జిల్లా కలెక్టరు విజయ క్రిష్ణన్ అన్నారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, డిఆర్ఓ బి.దయానిధి, కెఆర్ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి బివి.రాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి .మూర్తి పాల్గొన్నారు.

స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ గోరంట్ల ధర్మారావు పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కె. మోహన్‌రావు పాల్గొన్నారు. గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు, కెవి సత్యనారాయణ పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట సచివాలయంలో ఈఓ లోవరాజు ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచ్ సుంకర లక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దేవరాపల్లి : మండల అంబేద్కర్ ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో నాలుగు రోడ్ల కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎస్ఐ టి.మల్లేశ్వరరావు, కాటవల్లి అప్పారావు, తూటా ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక సంత బయలు వద్ద అంబేద్కర్ విగ్రహానికి గ్రామ సర్పంచ్ దిమ్మల అప్పారావు, అంబేద్కర్ జమే పునాది నాయకులు రాజాన బుజ్జిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిలా అప్పలనాయుడు, రామారావు, శివ పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పి. పద్మజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగం ప్రాముఖ్యత ను వివరించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోనూ, జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలోనూ, అంబేద్కర్ గురుకులం లోనూ, మొగలిపురం గ్రామ సచివాలయంలో సర్పంచ్ గండి అరుణ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

కె.కోటపాడు : స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల పరిషత్ ఏవో అప్పలరాజు, ఎంఇఒ, వెలుగు కార్యాలయ ఉద్యోగులు, ఐసిడిఎస్ , ఇంజనీరింగ్ అధికారులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రతిజ్ఞ చేశారు. జెడ్పి హైస్కూల్ ఆవరణలో రెల్లి వీధిలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ భవాని రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

యలమంచిలి : యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ హైస్కూల్, మండలంలోని పెటబయ్యవరం ప్రాథమిక పాఠశాల, జంపపాలెం జిల్లా పరిషత్ పాఠశాలల్లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూర్యప్రకాష్, బి.ధనలక్ష్మి, శాస్త్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎం.వెంకట అప్పారావు భారత రాజ్యాంగం గురించి విద్యార్థులకు వివరించారు. ఫ్లకార్డులు పట్టుకొని ర్యాలీ చేశారు. చౌడపల్లి విశాఖ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులు పలు ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ జి అప్పలరాజు, ప్రిన్సిపాల్ శాంతి ప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : కలెక్టరేట్ మీటింగ్ హాలులో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల కృషి, శ్రమ ఫలితంగా రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రతి ఒక్కరూ తమ విధులను, కర్తవ్యాలను అంతఃకరణ శుద్ధితో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. జిల్లా ప్రజా పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ జె.సుభద్ర, సిఇఒ పి.నారాయణమూర్తి, ఉప కార్యనిర్వహణాధికారి కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



మాధవధారలో ప్రతిజ్ఞ చేస్తున్న టీచర్లు

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ పాల్గొన్నారు. ఎంవిపి.కాలనీ నగర శాఖా గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో సచివాలయ మెడికల్ సెక్రటరీ సుభాషి, ఇగ్నో ప్రాంతీయ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ గోనిపాటి ధర్మారావు పాల్గొన్నారు.

సీతమ్మధార : ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో 75వ భారతరాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని నిర్వహించారు. సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. సంస్థ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్, ఎన్‌వి.రమణమూర్తి, సిజిఎమ్ లు డి.సుమన్ కల్యాణి, జె.శ్రీనివాసరావు, అచ్చి రవికుమార్, టివిఎస్ఎన్.మూర్తి, బి.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

సీతమ్మధార : తాటిచెట్లపాలెం, ధర్మానగర్ హైవే వద్ద అంబేద్కర్ విగ్రహానికి వైసిపి ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు నివాళులర్పించారు. డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కెవిఎస్.ఎన్ శశికళ, సేనాపతి అప్పారావు పాల్గొన్నారు. జనసేన నగర కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు పూల మాల వేసి నివాళులర్పించారు.

మధురవాడ : జివిఎంసి జోన్2 కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికికార్యాలయ సూపరెంటిండెంట్ అక్కరబోయిన అప్పలరాజు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతిజ్ఞ చేయించారు.

పెందుర్తి: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్, ప్రిన్సిపాల్ ఎన్.ఇ.ప్లోరా, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసు, ఎఒ రవిబాబు, జె.మంజుల, డి.ఎస్.ప్రదీప్, ఎన్. సంధ్యారాణి పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండల పరిషత్, తహశీల్దార్, జివిఎంసి జోనల్ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ మంజుల, ఎంపిడిఒఎస్ హనుమంతరావు, ఇఒపిఆర్‌డి కనకల రమేష్ నాయుడు, ఎంఇఒలు ఎం.శివరాణి, జయ ప్రద, తహశీల్దార్ పి రామారావు, జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమప్రసన్న వాణి పాల్గొన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భాగం లక్ష్మి అధ్వర్యంలో భీమిలిలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

ఆరిలోవ : టిడిపి ఆధ్వర్యంలో పెదగదిలి కూడలి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందు, ఒమ్మి పోలారావు పాల్గొన్నారు. 10వ వార్డు ఇందిరానగర్‌లో ఇందిరా గ్రామ అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో వార్డు టిడిపి ఇన్‌చార్జ్ మద్దిల రాజశేఖర్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. వైవి.రావు, కెవి.ప్రసాద్, అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఆనందపురం : వేములవలస కూడలిలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళు లర్పించారు. సంఘం వ్యవస్థాపకుడు జంగం జోషి, కడగళ్ల నారాయణరావు, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. లోడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలో దళిత నాయకులు రాంబాబు నివాళులర్పించారు. నాయకులు రాంబాబు, యాగాటి రామారావు పాల్గొన్నారు. వేములవలస ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పండ్లు పంపిణీ చేశారు.

మాధవధార : కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రంలో వైస్ ప్రిన్సిపల్ ఉమాశంకర్ విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక పఠనం చేయించారు ప్రముఖ న్యాయవాది బి కామేశ్వరరావు, రామారావు జయలక్ష్మి, రమణమూర్తి, ఉమా భారతి, పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి -రావికమతం: గ్రామాలలో నిర్వహించే ఫ్యామిలీ ఫిజీషియన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దాసరి సూర్య కుమారి కోరారు.. మండలంలో కవగుంట గ్రామంలో మంగళవారం రావికమతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు . ఈ శిబిరంలో 40 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నెలకు ఒక మారు గ్రామంలో నిర్వహించే ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ ప్రజలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ .కార్యక్రమంలో ఏఎన్ఎం వరలక్ష్మి, డేటా ఆపరేటర్ మహేష్, ఆశాలు పలువురు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న తహశీల్దార్

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:గ్రామీణ ప్రాంతాల్లో తలెత్తే భూ సమస్యలను వీలైనంత వరకు రైతులు సామరస్యంగా పరిష్కరించుకోవాలని తహసిల్దార్ తిరుమల బాబు సూచించారు. జగ్గంపేట గ్రామంలో మంగళవారం ప్రజా ఫిర్యాదుల వేదికకు ఫిర్యాదుదారు కొరుపోలు దేవి చేసిన ఫిర్యాదుపై మాట్లాడారు. సర్వే నెంబర్ 79లో 29 సెంట్లు వారసత్వంగా సంక్రమించిన భూమిని ఆక్రమించుకోవడంపై అందిన ఫిర్యాదు పై విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారు హాజరు కాకపోవడం విశేషం. ఈ కార్యక్రమంలో మండల శ్రీనివాసు, ఆర్ఐ ఊర్ధ్వరావు, గ్రామ రెవెన్యూ అధికారి సతీష్ పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న సిబ్బంది

పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలోని సత్యవరం గ్రామంలో పశువులకు బ్రూసెల్లా వాక్సిన్ కార్యక్రమాన్ని మాడుగుల ఏరియా పశు వైద్య శాల సహాయ సంచాలకులు చిట్టి నాయుడు మంగళవారం పరిశీలించారు.పాడి రైతులతో మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాలలో ఈ బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం డిసెంబర్ నెల 19వ తేదీ వరకు జరుగుతుందని తెలిపారు.పాడి రైతులు 4 నుంచి 8 నెలల వయసు గల ఆడ పెయ్యలకు ఈ టీకాలు తప్పకుండా వేయించుకోవాలని కోరారు. ఇప్పటివరకు మండలంలో 120 ఆడ పెయ్యలకు ఈ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు.

అనంతరం సత్యవరం రైతు సేవా కేంద్రాన్ని, కె. జె. పురం పశు వైద్య శాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కె. జె. పురం పశు వైద్యాధికారి మణి లక్ష్మణ్, పశు సంవర్ధక సహాయకుడు చంద్రరావు పాల్గొన్నారు.

తాండవలో పూడికతీత పనులు

ప్రజాశక్తి- నాతవరం :మండలం తాండవ జలాశయం కుడి కాలువ లోని పూడిక తీతను పీకే గూడెం, జగ్గంపేట, కొత్తూరు, గంగవరం, వెంకటాపురం, రామకృష్ణా పురం గ్రామస్తులు తొలగించారు. వచ్చే సంవత్సరం అయినా ముందుగా పూడికలు, జంగిల్స్ క్లియర్ చేసి నీరు అందించాలని రైతులు కోరారు.



పూడిక తీస్తున్న రైతులు

నేవీ మారథాన్ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ:విశాఖ నగరంలో డిసెంబర్ 15న వైజాగ్ నేవీ మారథాన్ జరగబోతున్నందున సంబంధిత ఏర్పాట్లను చేయాలని జీవీఎంసీ అధికారులకు జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన వైజాగ్ నేవీ కెప్టెన్, రేస్ డైరెక్టర్ టి.ఆర్.ఎస్ కుమార్, జీవిఎంసి అధికారులతో కలిసి ఆర్.కె. బీచ్ సమీప ప్రాంతాలను పరిశీలించారు. ఈ పరిశీలనలో డిసెంబర్ 15వ తేదీన వైజాగ్ నేవీ మారథాన్ 42 కిలోమీటర్లు రన్ ఆర్కే బీచ్ నుండి భీమిలి వరకు నేవీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నందున చేస్తున్న ఏర్పాట్లు వివరాలను నేవీ కెప్టెన్ టి.ఆర్.ఎస్ కుమార్‌ను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ శాంసన్ రాజు, డీసీపీ హరిదాసు, ఏసీబీ సి. హెచ్.మధుసూదన రావు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్



విత్తనాలు ఇస్తున్న ఎమ్మెల్యే బండారు

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - చీడికాడ:రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తెలిపారు. మండల కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో అధికారి కృష్ణవేణి ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు సబ్సిడీపై వేరుశనగ మినువులు పెసలు, బొబ్బర్లు విత్తనాలు అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో రైతులందరూ ఫసల్ బీమా యోజన పథకానికి నగదు చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు. ఈ భీమాతో ఎకరానికి 25 వేల వరకు నష్టపరిహారాన్ని పొందవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నాయకులు చిన్నంనాయుడు, గండి ముసలి నాయుడు, ఎర్ర అప్పారావు రామనాయుడు. గాలి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సన్యాసిరావు రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం సభ్యులు

విపత్తుల్లో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రకృతి విపత్తుల సమయములో అప్రమత్తంగా ఉండాలని (ఎన్.డి.ఆర్.ఎఫ్) 10వ బెటాలియన్ టీం కమాండరు వై.సత్యనారాయణ సూచించారు. మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో తుఫాన్ బిల్డింగ్‌లో మంగళవారం ప్రకృతి విపత్తులు, ప్రమాదాలు జరిగినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు, మత్స్యకారులకు అవగాహన కల్పించారు.ఉరుములు, మెరుపులు, బలమైన గాలులు వీచునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎన్ డి ఆర్ ఎఫ్ టీం మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నరసింహమూర్తి, సర్పంచ్ పిక్కి అప్పలనర్స, ఆర్ఐ కన్నబాబు, ఎంపీటీసీ పిక్కి సత్తియ్య, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు పిక్కి గంగరాజు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఐ

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-యస్.రాయవరం:డ్రగ్స్‌కి యువత దూరంగా ఉండాలని స్తానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లొడ్డు రామకృష్ణ సూచించారు. మంగళవారం సాయంత్రం అడ్డురోడ్డులోని ప్రజ్ఞ జూనియర్, డిగ్రీ కళాశాలలో సంకల్పం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు దారి తీసే వయసు ఇంటర్, డిగ్రీ చదివే కాలమన్నారు. చెడు స్నేహాలు, కుటుంబ పరిస్థితులతో పాటు తమ ఆలోచనా ధోరణితో కొంత మంది యువత చెడు మార్గాన్ని ఎంచుకుని తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి వ్యసనాలతో సమాజంలో ఆరోగ్యం పాడవడంతో పాటు, కుటుంబం అస్తవ్యస్తమవుతుందన్నారు. డ్రగ్ కేసులో పట్టుబడితే ఇరవై సంవత్సరాల వరకు నాన్ బెయిలబుల్ కేసు నమోదవుతుందని హెచ్చరించారు.

స్టీల్‌ప్లాంట్‌కు బస్సు సర్వీసులు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ సిటీ డిపోలో నూతన బస్ సర్వీసులను మంగళవారం గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. లంకెలపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్ స్కూల్ ఉన్న సెక్టార్ 12, జనరల్ హాస్పిటల్‌కు బస్సు సర్వీసులను, అలాగే నూతన సూపర్ లగ్జరీ బస్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్లు గౌతమ్ చటర్జీ, కె.గంగాధర్, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి.శ్రీనివాస్, మెకానికల్ ఫోర్‌మ్యాన్ భూషణం, రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ట్రైబల్ వెల్ఫేర్ అధికారి

ప్రజాశక్తి -కొత్తకోట:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, గిరిజనుల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణి నాగ శిరీష తెలిపారు. కొట్నాబిల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన జాతీయ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, మారుమూల గిరిజనుల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని, ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలని చెప్పారు . గిరిజన యువత విద్యా ఆవకాశాలను అందిపుచ్చుకొని విద్యలో ఉన్నత స్థాయికి చేరాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో ఉద్యోగాలు సాదించి జీవితంలో స్థిరపడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బానోజీరావు, సర్పంచ్ సీతాదేవి, సచివాలయం కార్యదర్శి సత్యారావు, గిరిజన సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:ఓల్డ్ టౌన్ బురుజుపేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాలు డిసెంబర్ రెండవ తేదీ నుంచి నెలరోజులపాటు 30 వ తేదీ వరకు జరగనున్నాయి. ఉత్సవాలకు సంబంధించి మొదటి గురువారం పంచామృత అభిషేకం టికెట్ (రూ.7,500)ను ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ కొనుగోలు చేశారు. మంగళవారం ఆలయానికి వచ్చిన ఆయన ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం కార్య నిర్వహణ అధికారి కె.శోభారాణి మీడియాతో మాట్లాడుతూ మొదటి గురువారం 5 వ తేదిన , రెండవ గురువారం 12 న, మూడో గురువారం 19న, 4 గురువారం 26 న ఉత్సవ పర్వదినములు జరుగుతాయని తెలిపారు. 22 వ తేదీన వేదసభ, అర్చక సదస్సు, 28 న రదయాత్ర ,26 న సహస్ర ఘటాభిషేకం,మహా అన్నదాన ప్రసాదం జరుగుతాయని తెలిపారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా అమ్మవారి ఉత్సవాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఆలయ ఎఈవో తిరుమలేశ్వర రావు,ఈ ఈ రమణ పాల్గొన్నారు.



చర్చలు జరుపుతున్న అధికారులు

తోషిబా - హెచ్ఎస్ఎల్ అధికారుల సమావేశం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్, జపాన్‌లోని తోషిబా బ్యాటరీ డివిజన్ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం మధ్య మంగళవారం సమీక్షా సమావేశం జరిగింది. 'మేకిన్ ఇండియా'లో భాగంగా భాగంగా షిప్‌యార్డ్ రచించిన ప్రణాళికలను హెచ్ఎస్ఎల్ అధికారులు వివరించారు. తోషిబా రూపొందించిన అత్యాధునిక లిథియం టైటానియం ఆక్సైడ్ బ్యాటరీ టెక్నాలజీని ఏకీకృతం చేయడంపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా సాటో గోరో-సాన్ మాట్లాడుతూ, భారత్‌లో నౌకా నిర్మాణంలో స్థిరమైన ఆవిష్కరణలకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. డైరెక్టర్ సిఎమ్‌డి ఇ గిర్దీప్ సింగ్ మాట్లాడుతూ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం ప్రపంచ స్థాయి పరిష్కారాలను అందిస్తుందన్నారు. సమావేశంలో తోషిబా ఇండియా డైరెక్టర్ కజుటక నిషిమురా - సాన్, సేల్స్ ఇంచార్జ్ రాకేష్ ట్రాక్రు, ఎల్‌డబ్ల్యుటి గ్రూప్ ప్రతినిధి మణిందర్ సింగ్ పాల్గొన్నారు.

లోహిత్‌ను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:ఇటీవల రాజమండ్రి, గుంటూరులో జరిగిన జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బంగారు పతకం సాధించిన శెట్టి లోహిత్‌నుమంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అభినందించారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కొత్తకోట:వ్యవసాయ పంటలలో వచ్చే తెగుళ్ళు, నివారణపై కింజరాపు ఎర్రంనాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు మత్సవానిపాలెం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. కొండెం పూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రాజ్ కుమార్, కిషోర్, సత్తిబాబు పర్యవేక్షణలో రైతులకు పలు సూచనలు సలహాలు అందించారు. వరి పంటలో ఎక్కువగా రెల్లా రాల్చుపురుగు ఉన్నట్లు గుర్తించారు. వీటి నిర్మూలనకు తీసుకోవల్సిన జాగ్రత్తలు గురుంచి రైతులకు వివరించారు.ఈ పురుగు నివారణకు పొలానికి ముందుగా నీరు పెట్టి క్లోరోపైరీ ఫాస్ 20ఈసి 2.5 ఎంఎల్ మందును లీటర్ నీటిలో కలిపి సాయంత్రం సమయం లో పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమం లో విద్యార్థులు జ్యోతిశ్రీ, దివ్యామణి,ప్రతిభ, అనుపమ తదితరులు పాల్గొన్నారు...

కోటవురట్ల: వరిలో రెల్లరాల్చు పురుగు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సరోజిని సూచించారు. అన్నవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు.

మాడుగుల: వరి పంట ఆశిస్తున్న రేల్ల పురుగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి వాసుదేవరావు సూచించారు. కింతలి వల్లాపురం, అవురువాడ గ్రామాలలో "పొలం పిలుస్తోంది" కార్యక్రమం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం వరి పంట గింజ గట్టిపడే దశలో ఉందని, ఈ దశలో వరి పంటను రేళ్ళ రాల్చు పురుగు ఆశిస్తుందన్నారు.ఈ కార్యక్రములో స్థానిక నాయకులు కియుడు త్రిమూర్తులు దొర, రైతు సేవా కేంద్ర సిబ్బంది వై.కళ్యాణ్, స్వప్న పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని చోద్యం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుధారాణి వరి పొలాలను పరిశీలించారు. వరికి ఆశించిన రెల్లరాల్చు పురుగు నివారణ కోసం డ్రోన్‌తో పిచికారీ చేశారు.ఈ కార్యక్రమంలో విఎఎ జయలక్ష్మీ పాల్గొన్నారు.



గొలుగొండ మండలంలో చోద్యంలో అవగాహన కల్పిస్తున్న ఎఒ